క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొరిటిపాడు: విద్యుత్ 11 కేవీ హరిహర మహల్ ఫీడర్‌లో చెట్ల కొమ్మలు తొలిగించుట, విద్యుత్ లైన్ మెయింట్‌నెన్స్‌లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ గుంటూరు టౌన్–2 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 వరకు లక్ష్మీపురం, రామన్నపేట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కొరిటిపాడు: కాకుమానువారితోట విద్యుత్ ఉప కేంద్రం 11కేవీ డొంక రోడ్ ఫీడర్ షిఫ్టింగ్‌లో భాగంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు గుంటూరు టౌన్4 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.హెచ్.ఖాన్, అసిస్టెంట్ ఇంజినీర్ ఎం.రవికుమార్ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కాకుమానువారి తోట, వల్లూరివారి తోట, మాల కొండయ్య కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు కార్మికుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పనిచేసే ప్రజారోగ్య, ఇంజినీరింగ్ కార్మికులు, ఉద్యోగులు తమ సమస్యలపై ఫిర్యాదులు, అర్జీలు అందించేందుకు శుక్రవారం సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తామని నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ విభాగాల వారీగా కార్మికుల, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ నిర్వహించనున్నామని తెలిపారు. క్షేత్రస్థాయిలో కార్మికులు ప్రధానంగా పీఎఫ్, ఈఎస్ఐ, రుణాలు, ఆప్కాస్ తదితర అంశాలపై, ఉద్యోగులు సమస్యలపై ఎదురవుతున్న అర్జీలను గ్రీవెన్స్‌లో అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ



లక్ష్మీపురం: కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై పెను భారాన్ని మోపుతూ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి విద్యుత్ చార్జీలు పెంచటం దారుణమని సీపీఐ నగర సహాయ కార్యదర్శి రావుల అంజిబాబు తెలిపారు. ఈనెల 23వ తేదీన పార్టీ 28వ రాష్ట్ర మహాసభలు ఒంగోలులో నిర్వహిస్తున్న నేపథ్యంలో మహాసభ వాల్ పోస్టర్లను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజా, కార్మిక ఉద్యోగ, రైతాంగ సమస్యలను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. పార్టీ నాయకులు కోట్లమరియదాసు, దాసం, కాంతారావు, డేవిడ్, జాన్ బాబు, సురేష్, కిరణ్ నాగరాజు, మరియబాబు, బుజ్జి పాల్గొన్నారు.

సాంస్కృతిక పోటీల్లో ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: ఆక్స్‌ఫర్డ్ సీబీఎస్ఈ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఎస్పీ తమశ్రిత వివిధ సంస్థలు నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో ప్రతిభ చూపి బహుమతులు గెలుపొందినట్లు పాఠశాల డైరెక్టర్ ఎస్.విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. గురువారం బృందావన్‌గార్డెన్స్‌లోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ భారతీయ విద్యా భవన్ నిర్వహించిన అన్నమయ్య కీర్తనల పోటీలో ఉత్సాహంగా పాల్గొన్న తమశ్రిత ఉత్తమ ప్రతిభ చూపి, పతకాన్ని సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా హరేకృష్ణ గోకుల క్షేత్రం నిర్వహించిన హెరిటేజ్ ఫెస్ట్–2025 కథల పోటీల్లో తృతీయ బహుమతితో పాటు సంగీత స్వరాలాపాన పోటీలో ప్రశంసా పత్రాలు పొందినట్లు వివరించారు. పాఠశాల డైరెక్టర్ ఆరోగ్య జోసఫ్ రెడ్డి, పాఠశాల చైర్మన్ ఎస్.ఫ్రాన్సిస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ యువతకు హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ

నెహ్రూనగర్: ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎస్సీ యువతకు (ఐదుగురు మహిళలు, ఐదుగురు పురుషులు) హెచ్‌ఎంవీ(హెవీ మోటార్ వెహికల్) డ్రైవర్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ శాఖ ఈడీ శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. అభ్యర్థులు కనీసం ఒక సంవత్సరం కాలపరిమితి గల ఎల్‌ఎంవీ లైసెన్స్ కలిగి ఉండటంతో పాటు హెవీ డ్రైవింగ్ ఎల్ఎల్ఆర్ కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఎస్సీ కార్పొరేషన్ గుంటూరు, కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు 9440268192 సంప్రదించాలన్నారు.

కూటమి పాలనపై విశ్వాసం పోయింది

- పథకాల అమలులో బాబుకు చిత్తశుద్ధి లేదు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి రాంబాబు
- 20వ డివిజన్‌లో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ'



సభలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు, వేదికపై మోదుగుల, నూరిఫాతిమా

నెహ్రూనగర్: కూటమి పాలనలో ప్రజలు అన్ని విధాలుగా మోసపోయారని, పాలనపై ప్రజల్లో విశ్వాసం పోయిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి రాంబాబు పేర్కొన్నారు. గురువారం పశ్చిమ నియోజకవర్గంలోని 20వ డివిజన్ పరిధిలోని నల్లచెరువులో పార్టీ నాయకులు ఖాజా మొయిద్దీన్, శివారెడ్డి, కొరిటిపాటి ప్రేమ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. డివిజన్‌లోని ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుస్తూ చంద్రబాబు మోసాలను వివరించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాగైనా గెలవడం కోసం చంద్రబాబు ఇతర పార్టీలతో జతకట్టి, బూటకపు హామీలు ఎన్నో ఇచ్చాడన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక హామీలను పూర్తిగా విస్మరించి ఓట్లు వేసిన ప్రజలను మోసం చేశాడన్నారు. అరకొరగా ఇస్తున్న పథకాలకు ఎన్నో కొర్రీలు వేస్తూ.. సంక్షేమానికి బాబు తూట్లు పొడుస్తున్నారని మండిపడ్డారు.

మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట

పార్టీ గుంటూరు పార్లమెంట్ పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాలను మోసం చేయడంతో చంద్రబాబు దిట్ట అన్నారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినప్పటికీ ఇచ్చిన హామీలను సక్రమంగా అమలు చేసిన పాపాన పోలేదన్నారు. గతం కంటే ఇప్పుడు బడ్జెట్ పెరిగినప్పటికీ, అప్పులు చేస్తున్నప్పటికీ సంక్షేమ పథకాలు ఎందుకు సక్రమంగా అమలు చేయడంలేదో చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు అంటూ సవాలక్ష నిబంధనలు విధించారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి, పార్టీ నాయకులు పఠాన్ సైదా, పల్లపు మహేష్, సోమీ కమల్, మొహమ్మద్ మసూద్, ఇబ్రహీం, షేక్ సైదా, సునీల్, సత్యం, వెంకటేష్, సుల్తాన్, బాషా, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

మెట్రోపాలిటన్ సర్వైలెన్స్ పనులు వేగవంతం

జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు


అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో భాగంగా గుంటూరు నగరానికి మంజూరైన ప్రతిష్టాత్మక మెట్రోపాలిటన్ సర్వైలెన్స్ యూనిట్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఏపీ ఎంఎస్ఐడీసీ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక మెడికల్ కాలేజీలో జరుగుతున్న మెట్రోపాలిటన్ సర్వైలెన్స్ యూనిట్ పనులను ఇన్‌ఛార్జ్ ఎంహెచ్‌ఓ రామారావు, సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, అత్యున్నత ప్రమాణాలు, నాణ్యతతో కూడిన వైద్య పరీక్షలు చేయడానికి వీలుగా గుంటూరు నగరంలో మెట్రోపాలిటన్ సర్వైలెన్స్ యూనిట్‌ని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, సదరు యూనిట్ ఏర్పాటు పనుల్లో దేశంలో ముందున్నామన్నారు. యూనిట్ పనుల పురోగతిపై ఏపీ ఎంఎస్ఐడీసీ అధికారులు ప్రతి రోజు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పనుల్లో జాప్యం జరగడానికి వీలు లేదని, క్షేత్ర స్థాయిలో ఏ సమస్య ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

నగరంలో పచ్చదనం పెంపే లక్ష్యం..

నగరపాలక సంస్థ పరిధిలో పచ్చదనం పెంపే లక్ష్యంగా ప్రజలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో కృషి చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. గురువారం కమిషనర్ ఇన్నర్ రింగ్ రోడ్, గాయత్రి నగర్, బ్రాడీపేట తదితర ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి పనులను, ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో మిషన్ గ్రీన్ గుంటూరులో భాగంగా దశల వారీగా 5 లక్షల మొక్కలు నాటి, నగరాన్ని సుందర, ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన నగరంగా తీర్చిదిద్దుకోవడానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

రూ.19 కోట్లతో అభివృద్ధి పనులకు ఆమోదం

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో సుమారు రూ.19 కోట్లతో పలు డివిజన్లలో వివిధ అభివృద్ధి పనులను నిర్వహించేందుకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపిందని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలియజేశారు. గురువారం స్టాండింగ్ కమిటీ సమావేశం మేయర్ చాంబర్‌లో నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. కొల్లి శారద హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లోని 81 షాపులకు వేలంలో పాల్గొని హెచ్చు పాట పాడి లీజు దక్కించుకున్న లీజు దారులకు షాపులను కేటాయించేందుకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. ఆయా డివిజన్లకు సంబంధించిన ప్రజా ప్రతినిధులు, నగర పాలక సంస్థ అధికారులు ప్రతిపాదించిన 60 అంశాలకు సంబంధించిన అభివృద్ధి పనులను కమిటీ సభ్యులు, నగర పాలక సంస్థ వివిధ విభాగాధిపతులతో కలిసి చర్చించి ఆమోదం తెలిపారు. తాగు నీటి రిజర్వాయర్లు, తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్ మరమ్మతులు నిర్వహణ, నగర పాలక సంస్థ పరిధిలోని పలు షాపింగ్ కాంప్లెక్స్‌లలో లీజు గడువు పూర్తయిన షాపులకు నిబంధనల ప్రకారం రెన్యువల్‌ను చేసేందుకు, రోడ్లు, డ్రెయిన్లు, వీధి దీపాలు, తాగునీటి పైపులైన్లు ఏర్పాటు వంటి పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపామన్నారు. స్టాండింగ్ కమిటీ సభ్యులు ఈరంటి వరప్రసాద్, షేక్ మీరావలి, కొమ్మినేని కోటేశ్వర రావు, దాసరి లక్ష్మీ దుర్గ, ముప్పవరపు భారతి, డిప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, సెక్రటరీ బి.శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ ఎస్ఈ సుందర్రామిరెడ్డి, రెవెన్యూ సూపరింటెండెంట్ రవికిరణ్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న మేయర్ రవీంద్ర, చిత్రంలో ఎమ్మెల్యే మాధవి

నెహ్రూనగర్: గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 25వ డివిజన్‌లో రూ.1.66 కోట్ల అంచనాలతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే గల్లా మాధవితో కలిసి నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో తప్పనిసరిగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. పనులు జరిగే సమయంలో ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పనులను పర్యవేక్షణ చేయాలన్నారు. డిప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్పొరేటర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వర్గీకరణతో మాలలకు అన్యాయం


కేంద్ర మంత్రి పెమ్మసానికి వినతిపత్రం అందజేస్తున్న మాల మహానాడు నాయకులు

నెహ్రూనగర్: ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం జరుగుతుందని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా గురువారం ఢిల్లీలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కార్యాలయంలో ఆయన్ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఏపీలో 2011 జనాభా లెక్కల ఆధారంగా తెలుగుదేశం ప్రభుత్వం తెచ్చిన ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ వల్ల మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. సుమారు 80 లక్షలకుపైగా ఉన్న మాలలు అన్ని రంగాలలో యువతకు, ఉద్యోగస్తులకు, విద్యార్థులకు అన్యాయం చేసే కుట్ర నడుస్తుందని దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో మాలమహానాడు నాయకులు డాక్టర్ గోదా జాన్ పాల్, పసుల రామ్మూర్తి, వెంటపల్లి జాన్ మార్క్, గోగులమూడి రాజు తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ పోలీసులకు రెయిన్ కోటులు


డీఎస్పీ, సీఐలకు రెయిన్ కోటులను అందిస్తున్న అసోసియేషన్ల సభ్యులు

నగరంపాలెం: ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు రహదారులపై విధులు నిర్వర్తించే ట్రాఫిక్ పోలీసులకు సహకారం అందించడం అభినందనీయమని తూర్పు సబ్ డివిజనల్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్ అన్నారు. వర్షకాలం దృష్ట్యా గుంటూరు కిరాణా మర్చంట్ అసోసియేషన్, గోల్డ్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు గురువారం తూర్పు సబ్ డివిజనల్ కార్యాలయంలో తూర్పు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సీఐ అశోక్‌కుమార్‌కు రెయిన్ కోటులను అందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ అబ్దుల్‌అజీజ్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షకాలం దృష్ట్యా ట్రాఫిక్ పోలీసులు విధుల్లో ఉండాల్సి వస్తోందని, రెయిన్ కోటులు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత ట్యూషన్ సెంటర్లు ప్రారంభం

లక్ష్మీపురం: నాణ్యమైన చదువు అందరికీ అందుబాటులో వచ్చినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని, అందుకోసమే ట్యూషన్ పాయింట్లు ఏర్పాటుకు తమ సంఘం కృషి చేస్తున్నదని విశ్వమానవ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు మస్తాన్‌రావు తెలిపారు. గుంటూరు చిల్డ్రన్స్ క్లబ్, విశ్వమానవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గుంటూరు రామిరెడ్డి తోట, పోస్టల్‌కాలనీ ప్రాంతాలలో గురువారం ఉచిత ట్యూషన్ సెంటర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం పెరిగినప్పుడే సాధ్యమవుతుందన్నారు. గుంటూరు చిల్డ్రన్స్ క్లబ్ నిర్వాహకులు కె.నళినీకాంత్ మాట్లాడుతూ ట్యూషన్ సెంటర్లలో విద్యార్థులకు చదువుతోపాటు మంచి విలువలు, అలవాట్లు, సామాజిక బాధ్యత కూడా నేర్పే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. గుంటూరు నగరంలో ఆరు ప్రాంతాలలో ట్యూషన్ సెంటర్ల నిర్వహణకు సహకరిస్తున్న వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ట్యూషన్ సెంటర్ నిర్వాహకులు కె శ్రీనివాసరావు, ట్యూటర్లు బ్రహ్మానందం, పవిత్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉమెన్స్ కళాశాలలో ఫ్రెషర్స్ డే



గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం జూనియర్ విద్యార్థినులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటర్మీడియెట్ విద్య ఆర్జేడీ జె.పద్మ, ఆర్ఐఓ జి.సునీత ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ, ఆధునిక వస్త్రధారణతో కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థినుల నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.ఉమాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏఎన్ఎంలకు ప్రమోషన్ కల్పించండి



గుంటూరు మెడికల్: జిల్లాలో ఖాళీగా ఉన్న ఎంపీహెచ్ఏ ఫిమేల్ పోస్టులను పదోన్నతి ద్వారా భర్తీ చేయాలని ఏపీ హంస అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు బి.నాగవర్ధన్ ఆధ్వర్యంలో గురువారం పలువురు అసోసియేషన్ నేతలు డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మిని కలిసి కోరారు. గత ఏడాది ఏప్రిల్ 1న రెగ్యులర్ అయిన ఎంపీహెచ్ఏ మేల్, ఫిమేల్ ఉద్యోగులకు, ఫార్మాసిస్టులకు, ల్యాబ్ టెక్నీషియన్‌లకు, ప్రొబేషన్ డిక్లర్ చేయాలని కోరారు. ప్రొబేషన్ డిక్లరేషన్‌కు పోలీసు ఎంక్వైరీ పూర్తి చేయించాలని కోరారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన డీఎంహెచ్ఓ ఖాళీగా ఉన్న పోస్టులను ఈనెల 25న కౌన్సెలింగ్ నిర్వహించి భర్తీ చేస్తామని తెలిపారు.

డిజిటల్ ఐడీని వెంటనే పూర్తి చేయాలి

గుంటూరు మెడికల్: ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో భాగంగా గురువారం గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రులకు వచ్చిన ప్రతి ఒక్కరికీ ఆయుష్మాన్ భారత్ డిజిటల్ ఐడీని క్రియేట్ చేయాలన్నారు. వీలైనంత త్వరగా ఐడీలు పూర్తిచేయాలని సూచించారు. ఆరోగ్య కేంద్రాల పరిధిలోని కాలేజీలు, పాఠశాలలకు వెళ్లి డిజిటల్ ఐడీలు పూర్తి చేస్తే త్వరగా అవుతాయన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలు డిజిటల్ ఐడీల క్రియేషన్‌లో వెనుకబడ్డాయని, వీలైనంత త్వరగా వీటిని పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో టీఓటీ సుశీల, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, డాక్టర్ దాసరి శ్రీనివాసులు, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ రోహిణి రత్నశ్రీ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరులో కిమ్స్ కడల్స్ సేవలు

ప్రారంభించిన డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి


అంబులెన్స్‌ను ప్రారంభించిన డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: గుంటూరులోని కిమ్స్ శిఖర ఆస్పత్రిలో మాతా శిశువు సూపర్ స్పెషాలిటీ సేవల విభాగం కిమ్స్ కడల్స్ ఆస్పత్రిలోని అత్యాధునిక పరికరాలు గల అంబులెన్స్‌ను గుంటూరు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి గురువారం ప్రారంభించారు. అనంతరం డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ గుంటూరు ప్రాంత ప్రజలకు స్త్రీ, పిల్లల సంరక్షణ విషయంలో అత్యున్నత స్థాయి వైద్యసేవలు అందించడానికి కిమ్స్ కడల్స్ ఆస్పత్రి గుంటూరు వచ్చిందన్నారు. అత్యాధునిక వైద్యసేవల కోసం ఇప్పటివరకు హైదరాబాద్, బెంగళూరు లాంటి నగరాలకు వెళ్లాల్సి వచ్చేదని తెలిపారు. ఇక నుంచి గుంటూరులోనే ఇవన్నీ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ అనిత, సీనియర్ పీడియాట్రీషన్ డాక్టర్ సాహితీ, పీడియాట్రిక్స్ ఇంటెన్సివిస్ట్ డాక్టర్ పల్నాటి బాలకృష్ణారెడ్డి, సీఓఓ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

'శ్రీమద్భగవద్గీత'పై ఆధ్యాత్మిక ప్రవచనం


మాట్లాడుతున్న సువీరానందస్వామి

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై గురువారం శ్రీమద్భగవద్గీత శ్రద్ధాత్రయ విభాగయోగంపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. బండ్లమూడి విజయలక్ష్మి ఆధ్వర్యంలో కార్యక్రమం జరగ్గా, ఆలయ పాలకవర్గం జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. చిన్మయ మిషన్ బ్రహ్మచారి సువీరానందస్వామి ప్రసంగిస్తూ వేదశాస్త్ర పఠనం, పరమేశ్వరుని నామ జప సాధన వంటివి వాక్కుకు సంబంధించిన తపస్సులు అని అన్నారు. తపస్సులను ఫలకాంక్షలేని యోగులు శ్రద్ధతో ఆచరించినప్పుడు, వాటిని సాత్విక తపస్సులుగా పిలుస్తారని శ్రీకృష్ణపరమాత్మ అర్జునుడికి తెలియజేశారని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం..

స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో విశ్వశాంతిని కాంక్షిస్తూ గురువారం చండీహోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులచే తొమ్మిది మంది వేదపండితుల నిర్వహణలో గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, రుద్ర, లక్ష్మీ గణపతి, చండీ హోమాలు నిర్వహించి, పూర్ణాహుతి చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటి అధ్యక్షుడు సిహెచ్. మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శులు ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంతరిక్ష ప్రగతి పోస్టర్లు ఆవిష్కరణ


విద్యార్థినులతో కలిసి పోస్టర్లు ఆవిష్కరిస్తున్న శాంతమూర్తి, ప్రసన్న

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతిరోడ్డులోని చిల్డ్రన్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు జి.శాంతమూర్తి ఆధ్వర్యంలో గురువారం ఏఎన్‌యూ వద్ద ఉన్న ఎస్ఎస్‌వీ ఇంటర్నేషనల్ పాఠశాలలో భారత అంతరిక్ష ప్రగతిని చాటుతూ రూపొందించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా శాంతమూర్తి మాట్లాడుతూ 2023 ఆగస్టు 23న చంద్రుడిపై శాటిలైట్ దించిన నాలుగో దేశంగా, దక్షిణ ధ్రువంపై ఉపగ్రహాన్ని దించిన తొలిదేశంగా భారత్ అవతరించిందని, ఈ చారిత్రక విజయానికి గుర్తుగా ప్రధాని నరేంద్రమోదీ ఆగస్టు 23ని జాతీయ అంతరిక్ష దినోత్సవంగా ప్రకటించారని తెలిపారు. ఈసందర్భంగా తమ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అంతరిక్ష పరిశోధనలపై అవగాహన కలిగించేందుకు పోస్టర్లు ఆవిష్కరింప చేశామని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసన్న, జీఎం మనోహర్‌రెడ్డి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆర్థిక రంగంలో కెరీర్‌పై దృష్టి సారించాలి


వేదికపై రవితేజ, దీప్తి

గుంటూరు ఎడ్యుకేషన్: డిగ్రీ కోర్సులు చదువుతున్న విద్యార్థినులు ఆర్థిక రంగంలో కెరీర్‌పై దృష్టి సారించాలని ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ప్రతినిధి మద్ది రవితేజ పేర్కొన్నారు. లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం బీకాం చివరి సంవత్సర విద్యార్థినులకు ఇన్వెస్టర్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రవితేజ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి సిప్ ప్రోగ్రాం ద్వారా ఆర్థిక లావాదేవీలు నిర్వహించాలని సూచించారు. మ్యూచువల్ ఫండ్స్ గురించి వివరించారు. బీకాం తరువాత విద్యార్థినులకు కెరీర్ అవకాశాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ దీప్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.